సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 2 । నవంబర్ । 2023

పోలీసుల కవాతు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం నంకెపల్లి, రుద్రవరం, అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి, చింతల్‌ఠాణా గ్రామాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా సుమారు 100 మంది బీఎస్‌ఎఫ్ సిబ్బంది బుధవారం రాత్రి కవాతు నిర్వహించారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్, ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ప్రజలే వేర్లు.. ప్రభుత్వమే ఫలం. వేర్లు సరిగా పనిని నిర్వర్తిస్తేనే ఫలం తియ్యగా ఉంటుంది.
– మహాత్మాగాంధీ

మీకు తెలుసా...?

గద్దెల్లేవ్.. జెండాలు ఎగురవ్

జూలపల్లి(పెద్దపల్లి): హుస్సేన్‌మియావాగు నీటి గలగలలు.. ఎటుచూసినా పచ్చని పంట పొలాలు.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన బౌద్ధ స్తూపం ఉన్న ఊరు.. పురావస్తు శాఖలో నమోదైన మారుమూల పల్లె.. అదే పెద్దపల్లి జిల్లాలోని వడ్కాపూర్ గ్రామం. 2000 సంవత్సరం వరకు నక్సల్స్ ఆధిపత్యంలో ఉండేది. అయినా, 1999లో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆ గ్రామానికి చేరుకున్నారు. బురద రోడ్లు చూశారు. అన్ని వీధుల్లోనూ సీసీ రోడ్లు, లక్షల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంక్ నిర్మించారు. అంతేకాదు.. పోలీసు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఇదే గ్రామస్తుడు వడ్కాపూర్ చంద్రమౌళి తను చదువుకుని, నిర్మించిన వేదికపైనే చంద్రబాబు గ్రామసభ నిర్వహించారు. ఇక్కడి మరో నక్సల్ నేత పుల్లూరి ప్రసాదరావు ఇప్పటికీ అజ్ఞాతంలోనే ఉన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఉన్నా.. ఆ పార్టీల గద్దెలు నిర్మించలేదు. పార్టీల జెండాలు ఎగురనూ లేవు.



వడ్కాపూర్ గ్రామం

న్యూస్‌రీల్

వెంకన్న ఆదాయం రూ.7.50లక్షలు



సిరిసిల్లటౌన్: శ్రీశాల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల ద్వారా వచ్చిన కానుకలు, ఆదాయాన్ని బుధవారం దేవాదాయ శాఖ అధికారులు లెక్కించారు. ఈ బ్రహ్మోత్సవాల ఆదాయం రూ.7,50,171 వచ్చాయని ఈవో మారుతిరావు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ గతేడాది కంటే ఈబ్రహ్మోత్సవాల్లో శ్రీవారి ఆదాయం స్వల్పంగా తగ్గిందన్నారు. హుండీ ద్వారా రూ.3,07,636, టికెట్లు, ప్రసాదాల వేలం ద్వారా రూ.4,42,535 వచ్చిందని వివరించారు. గతేడాది రూ.7,69,604 రాగా ఈ సంవత్సరం రూ.19,423 తక్కువ వచ్చినట్లు తెలిపారు. రథోత్సవం రోజున చంద్రగ్రహణం మూలంగా ఆదాయం తగ్గినట్లు వివరించారు. ఉత్సవాల నిర్వహణకు సహకరించిన ప్ర జాప్రతినిధులు, పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్‌శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలి పారు. ఆలయ మాజీ చైర్మన్లు ఉప్పుల విఠల్‌రెడ్డి, తీగల శేఖర్‌గౌడ్, అర్చకులు కృష్ణమాచారి, ఏఈవోలు ప్రభాకర్, రవీందర్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

సిరిసిల్లక్రైం: విద్యార్థులకు సైబర్ నేరాలు, భద్రతపై అవగాహన ఉండాలని సైబర్ సెల్ డీఎస్పీ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక శ్రీచైతన్య స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కల్పించారు. వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియాలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

బీజేపీ అభ్యర్థి చీప్ ట్రిక్స్

- టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్



ప్రెస్‌మీట్లో మాట్లాడుతున్న గూడూరి ప్రవీణ్

సిరిసిల్లటౌన్: రూ.16కోట్లు బ్యాంక్‌కు ఎగనామం పెట్టి ప్రజాధనం కాజేసిన బీజేపీ అభ్యర్థిని మంత్రి కేటీఆర్‌పై చీప్ ట్రిక్స్ ప్రయోగిస్తే సహించేది లేదని టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. కేటీఆర్ అంటేనే అభివృద్ధికి మారుపేరు అని.. ఆయన బీజేపీ అభ్యర్థిని రాణిరుద్రమ ఫేస్‌బుక్ హ్యాక్ చేయించారనడం హాస్యాస్పదమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల ప్రజలు ఆమెకు తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సిరిసిల్ల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కేటీఆర్‌ను లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఆర్‌బీఎస్ అధ్యక్షుడు గద్దం నర్సయ్య, పార్టీ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, అన్నల్‌దాస్ వేణు, బూర విష్ణు తదితరులు పాల్గొన్నారు.

స్నే'హితుల' ఆర్థిక చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

గంభీరావుపేట(సిరిసిల్ల): తోటి మిత్రుడు అనారోగ్య సమస్యలతో మృతిచెందగా.. అతని కుటుంబానికి స్నేహితులు ఆర్థిక భరోసా కల్పించారు. గంభీరావుపేట మండలం ముచ్చర్లకు చెందిన భూక్య రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. రవి కుటుంబానికి పదో తరగతి(2003–04) స్నేహితులు రూ.31వేలు సేకరించి అందించారు.

పొరపాటు జరిగితే తిప్పలే

- రేపటి నుంచే నామినేషన్లు
- సమగ్ర సమాచారం సేకరించే పనిలో అభ్యర్థులు
- న్యాయ నిపుణుల సలహాలతో ముందుకు
- జాతకం చూపించుకుంటున్న వైనం
- కలిసి వచ్చే తేదీన నామినేషన్ వేసేందుకు సన్నాహాలు



వేములవాడ తహసీల్దార్ కార్యాలయం

నామినేషన్లు, అఫిడవిట్ల దాఖలు సహా ఎన్నికల సంఘం నిబంధనలను పాటించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చూపినా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఇంతకుముందు మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు వనమా, కృష్ణమోహన్‌రెడ్డి వంటి నేతలు భారీ మెజారిటీతో గెలుపొందినా అఫిడవిట్లలోని కొన్ని సాంకేతిక అంశాలతో ఇబ్బంది పడ్డారు. రిటర్నింగ్ అధికారులకు సమర్పించే అఫిడవిట్లు అక్టోబర్ 21లోపు బీఆర్‌ఎస్ లీగల్ సెల్‌కు అందజేయాలి. వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తాం. పొరపాటు జరిగితే తిప్పలు తప్పవంటూ గత నెలలో తమ అభ్యర్థులకు సీఎం కేసీఆర్ హెచ్చరిక జారీ చేశారు. దీంతో బీఆర్‌ఎస్ అభ్యర్థులతోపాటు, విపక్ష పార్టీలు సైతం తమ నామినేషన్, అఫిడవిట్‌ల దాఖలుకు న్యాయనిపుణుల సలహాలు తీసుకుంటున్నారు.

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం రేపటి నుంచి(శుక్రవారం) మొదలుకానుంది. అభ్యర్థులు నామినేషన్ వేసుందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ అభ్యర్థులు నామినేషన్ వేసేటప్పుడు సమర్పించాల్సిన అఫిడవిట్ తదితర అంశాల మీద ఫోకస్ చేసి, భవిష్యత్‌లో సమస్యలు తలెత్తకుండా ఉండేలా న్యాయనిపుణుల సలహాలతో పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకున్నారు. టికెట్లు ఖరారైన విపక్ష పార్టీల అభ్యర్థులు సైతం సమగ్ర సమాచారం సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఓవైపు ప్రచారంలో పాల్గొంటూనే మరోవైపు తమ బంధువులు, సన్నిహితుల సాయంతో న్యాయనిపుణులతో ఒకటికి రెండుసార్లు క్రాస్ చెక్ చేసుకుంటున్నారు. వ్యక్తిగత వివరాలు, తమతోపాటు తమ కుటుంబసభ్యుల పేరు మీద ఉన్న స్థిర, చరాస్తుల వివరాలను, నేరారోపణలకు సంబంధించిన అంశాలు, ట్రాఫిక్ చలాన్లు, ఫోన్, విద్యుత్ బిల్లుల బకాయిలు, ఆదాయ పన్ను రిటర్న్‌లు వంటివి జాగ్రత్తగా స్క్రుటినీ చేయించుకుంటున్నారు.

కేసుల వివరాల కోసం డీజీపీకి లేఖలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులపై రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో తమపై నమోదైన కేసుల వివరాల కోసం డీజీపీకి లేఖలు రాస్తున్నారు. అలాగే అభ్యర్థులు, తమ కుటుంబసభ్యుల పేరు మీద ఉన్న వాహనాలపై ట్రాఫిక్ చలాన్లు, పన్ను బకాయిలు చెల్లించి, నో డ్యూ సర్టిఫికెట్స్ తీసుకుంటున్నారు.

ఆ 4 రోజుల్లోనే అధిక నామినేషన్లు..

నామినేషన్ మంచి రోజు వేయాలని భావిస్తున్న నేతలు తమకు నమ్మకమైన పండితులను సంప్రదిస్తున్నారు. తమ పేరిట ఏరోజు నామినేషన్ వేస్తే విజయం సిద్ధిస్తుందని తెలుసుకుంటున్నారు. మరికొందరు నేతలు దోషాలు పోయేందుకు పూజలు చేస్తున్నారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనుండగా, ఆయా రోజుల్లో తిథి, నక్షత్ర బలం చూయించుకుంటున్నారు. అభ్యర్థుల జాతక రీత్యా ప్రధానంగా 3, 4, 8, 9 తేదీల్లో నామినేషన్ దాఖలు చేస్తే విజయం వరిస్తుందని పండితులు సూచిస్తున్నారు. దీంతో ఈ నాలుగు రోజుల్లోనే నామినేషన్లు అధికంగా పడనున్నాయి.

ఇబ్బందులు రాకుండా డమ్మీల ఎంపిక

ఆర్వోకు సమర్పించే నామినేషన్, అఫిడవిట్‌లలో తప్పులు, అక్షర దోషాలు, ప్రతిపాదించే అనుచరుల వివరాల్లో ఎటువంటి తప్పులు లేకుండా స్క్రుటినీ చేయిస్తున్నారు. అలాగే తమ నామినేషన్ తిరస్కరిస్తే బరిలో నిలిచేలా కుటుంబసభ్యులను డమ్మీలుగా ఎంపిక చేసుకుంటున్నారు. వారి పేరుతో సైతం నామినేషన్లు, అఫడివిట్లు తయారు చేయించే పనిలో నేతలు ఉన్నారు. అన్ని పార్టీల కంటే బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రకటన ముందే వెలువడటంతో వారు ఈ తతంగం పూర్తి చేసి, మొదటిరోజే నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. విపక్ష అభ్యర్థులు సైతం అధికార పార్టీ లీగల్ సెల్‌కు దొరకుండా ఉండేందుకు ఆయా పార్టీల అనుబంధ లీగల్ టీంలతో సంప్రదింపులు జరుపుతున్నారు.

ఐటీ కంపెనీలు ఏవి?

- తొమ్మిదేళ్లలో ఒక్కటీ రాలేదు
- నలుగురిని పెట్టుకుని పాలిస్తున్నావ్
- ఇతర పార్టీల వారిని బీఆర్‌ఎస్ కొనుగోలు చేస్తుంది
- సింహగర్జన సభలో బీఎస్పీ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



అభివాదం చేస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

జంగ్ తెలంగాణ

సిరిసిల్ల: రాష్ట్ర ఐటీ మంత్రిగా ఉన్న కేటీఆర్ తొమ్మిదేళ్లలో ఒక్క ఐటీ కంపెనీని కూడా సిరిసిల్లకు తేలేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కళాశాల మైదానంలో బుధవారం రాత్రి జరిగిన సిరిసిల్ల సింహగర్జన సభలో మాట్లాడారు. కళాశాల మైదానంలో మీటింగ్ పెట్టుకునేందుకు అనుమతులున్నా.. మున్సిపల్ అధికారులు నిరాకరించారని, మంత్రి కేటీఆర్ తొత్తులు ఇంకా ఇక్కడ డ్యూటీ చేస్తున్నారన్నారు. ఎన్నికల కమిషన్ ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మండలానికి ఒక్కరు చొప్పున నలుగురు దొరలను పెట్టుకుని కేటీఆర్ పాలిస్తున్నాడని ఆరోపించారు. సిరిసిల్లలో పద్మశాలి నేతకు బీజేపీ టిక్కెట్ రాకుండా అడ్డుకుని, వరంగల్‌కు చెందిన రాణీ రుద్రమారెడ్డికి టిక్కెట్ ఇప్పించాడని ఆరోపించారు. బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటే అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని అడిగారు. పద్మశాలి నేతకు బీజేపీ టిక్కెట్ వస్తే.. కేటీఆర్ ఓట్లకు గండి పడుతుందనే కుట్ర చేశారన్నారు.

ఇక్కడి గాలి పీల్చిన వాడిని

2002లో జిల్లా ఎస్పీగా ఉన్న రోజుల్లో గర్జనపల్లి నుంచి రుద్రంగి వరకు, ఎల్లారెడ్డిపేట నుంచి నూకలమర్రి, సనుగుల, వట్టిమల్ల, మరిమడ్ల, తంగళ్లపల్లి గాలి పీల్చిన వాడినని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ పాత పరిచయమని ఈ ఒక్కసారికి ఆయన పోటీ నుంచి తప్పుకుని గోలి మోహన్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. జిల్లాలోని బీఆర్‌ఎస్ నాయకులు ఇతర పార్టీల నేతలను కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ముదిరాజ్ సంఘం నాయకుడికి రూ.2 కోట్లు ఇవ్వజూపారని అయినా.. ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టలేదన్నారు. సిరిసిల్ల, వేములవాడల్లో పోటీ చేస్తున్న బీఎస్పీ అభ్యర్థులు పేదవారని, ఆ పేద బిడ్డలను రాజకీయంగా చంపొద్దని కోరారు. ఈ మట్టి బిడ్డలకు ఆర్థికంగా అండగా ఉండి.. ఓట్లు వేయాలని కోరారు.

అందుబాటులో ఉంటా.. పిట్టల భూమేశ్

సిరిసిల్ల బీఎస్పీ అభ్యర్థి పిట్టల భూమేశ్ మాట్లాడుతూ ఇక్కడ దొరల పాలన సాగుతోందని, భూస్వామ్య విధానాలు మళ్లీ వచ్చాయన్నారు. ఇసుక మాఫియాను నడుపుతున్నారని ఆరోపించారు. అందుబాటులో ఉంటానని ఆదరించాలని కోరారు.

అండగా ఉండండి.. గోలి మోహన్

వేములవాడ బీఎస్పీ అభ్యర్థి గోలి మోహన్ మాట్లాడుతూ.. ఐటీ కంపెనీలకు జిల్లాకు తెచ్చి ఉద్యోగాలు కల్పిస్తానని, రైతులకు మేలు చేసేలా పనులు చేస్తానన్నారు. బీఎస్పీ బలపరిచిన బీసీ అభ్యర్థులకు అండగా ఉండి, ఏనుగు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

భారీ ర్యాలీ.. పార్టీ ఆఫీస్ ప్రారంభం

సిరిసిల్ల విద్యానగర్ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం నుంచి భారీ ర్యాలీని బీఎస్పీ కార్యకర్తలు నిర్వహించారు. ప్రవీణ్‌కుమార్ వాహనంపై ర్యాలీలో పాల్గొన్నారు. సుభాష్‌నగర్‌లో పార్టీ ఆఫీస్‌ను ప్రారంభించారు. బీఎస్పీ అభ్యర్థులపై గజ్జెల అశోక్ పద్మ దంపతులు రికార్డు చేసిన పాటల సీడీని ఆవిష్కరించారు. అగ్గిపెట్టెలో ఇమిడే చీరను న్యాయవాది కుంట శ్రీనివాస్ ప్రవీణ్‌కుమార్‌కు బహూకరించారు. గజమాలతో ప్రవీణ్‌కుమార్‌ను సన్మానించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వర్దెల్లి స్వామిగౌడ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకని భాను, నాయకులు గొట్టె రామచంద్రం, లింగంపల్లి మధుకర్ మాట్లాడారు. సభలో ఎనగందుల వెంకన్న, బొడ్డు మహేందర్, కుంట శ్రీనివాస్, చాకలి రమేశ్, దేవేంద్ర, ద్యాగల లక్ష్మి, చొప్పరి నాగరాజు, దర్శనం గంగాధర్, మేర్గు రాజు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్లకు హెల్ప్‌డెస్క్

- సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్



సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌లో అఖిలపక్ష నేతలతో మాట్లాడుతున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

సిరిసిల్ల: నామినేషన్లు వేసేందుకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించేందుకు సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో ఆనంద్‌కుమార్ తెలిపారు. తన ఆఫీస్‌లో బుధవారం రాజకీయపార్టీల నేతలతో సమావేశమయ్యారు. ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి అనుమతి తీసుకోవాలన్నారు. 15 అంశాలకు సంబంధించిన అనుమతులు సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుని అనుమతి పొందవచ్చని తెలిపారు. వివిధ పార్టీల నాయకులు ఎస్.కైలాస్‌కుమార్, కల్యాణచక్రవర్తి, తీగల శేఖర్‌గౌడ్, మహమ్మద్ మైముద్దీన్, కరుణాకర్, ఎస్.నాగరాజు, వై.రాజశేఖర్ పాల్గొన్నారు.

అందరూ సహకరించాలి

- క్రిమినల్ కేసుల వివరాలు ఇవ్వాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



కౌంటింగ్ కేంద్రం పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

సిరిసిల్ల: జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకుల సహకరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల నిర్వహణ, ఎన్నికల కమిషన్ నిబంధనలు, ఖర్చుల రిజిస్టర్‌ల నిర్వహణపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ 3న నోటిఫికేషన్ ప్రకటనతో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమై, 10న ముగుస్తుందని తెలిపారు. అభ్యర్థులు తమ నామినేషన్లను నవంబర్ 10వ తేదీ సాయంత్రం 3 గంటల్లోగా వేయాలని సూచించారు. 13న నామినేషన్ల పరిశీలన, 15న ఉపసంహరణ ఉంటుందని వివరించారు. సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌లో సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గం, వేములవాడ తహసీల్దార్ ఆఫీస్‌లో వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. నామినేషన్ దాఖలుకు ముందు అభ్యర్థులు తమ నామినేషన్లను హెల్ప్‌డెస్క్‌లో చెక్ చేయించుకోవాలని సూచించారు. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్లు దాఖలు చేయొచ్చని తెలిపారు. క్రిమినల్ కేసుల వివరాలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో 3 సార్లు పబ్లిష్ చేయాలని తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ నామినేషన్ కేంద్రం నుంచి 100 మీటర్ల దూరం వరకు బారికేడ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

కౌంటింగ్ కేంద్రాలు పరిశీలన

తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీలు పరిశీలించారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల కౌంటింగ్ ఒకే చోట ఉన్నందున.. వేర్వేరుగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భద్రతపై ఎస్పీ అఖిల్ మహాజన్ సూచనలు ఇచ్చారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఉన్నారు.

సీనియర్ సిటిజన్ వాయిస్



మాటే మంత్రం!

- గీ లొల్లి.. అప్పట్లో లేదు
- పాత'తరం' ఓటర్ల మనో'గతం'

సిరిసిల్ల: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఓ ఆయుధం. పాలకులను ఎన్నుకునేందుకు రాజ్యాంగం కల్పించిన సువర్ణ అవకాశం. ఎన్నికలు వచ్చినాయంటే మైకుల మోతలు.. ప్రచార ఆర్భాటాలు.. సభలు.. సమావేశాలు.. సోషల్ మీడియాలో ఆరోపణలు.. ఖండనలు.. ఎన్నికల హామీలు.. ఆచరణలో విఫలమైన ఘటనలు.. ఇలా ఒక్కటేమిటీ.. ఎన్నికలున్నన్నీ రోజులు ఓ హంగామా. ఇక ఎన్నికలకు ముందు జరిగే మద్యం పంపిణీ.. నోట్ల పంపిణీ.. ఇంటింటి ప్రచారం పేరిట బుజ్జగింపులు అన్నీ ఇన్నీ కావు. మరీ యాభై ఏళ్ల కిందట ఎన్నికల ప్రచారం ఎలా ఉండేది.. నాటికి.. నేటికి ఉన్న తేడా ఏంటి? అప్పటి ఎన్నికల తీరు తెన్నుల గురించి పాతతరంఓటర్లను పలకరిస్తే.. వారి మనోగతాన్నివెల్లడించారు. ఆనాటి ఎన్నికల సంగతులు వారి మాటల్లోనే..

ప్రచారం హుందాగా ఉండేది



నేను తొలిసారి అంటే 45 ఏళ్ల కిందట ఓటు వేశాను. ఇప్పటిలాగా ప్రచార ఆర్భాటాలు, గొడవలు ఉండేవి కాదు. ఎవరికి వారు హుందాగా ప్రచారం చేసేవారు. మైకులతో ప్రచారం చేసేవారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కూడా పరస్పర ఆరోపణలు చేసుకునే వారు కాదు. గెలిస్తే.. ఏం చేస్తారో.. చెప్పేవారు. నచ్చినోళ్లకు ఓట్లు వేసే వాళ్లం.

– చేపూరి బుచ్చయ్య(66 ఏళ్లు), వ్యాపారి, సిరిసిల్ల

4 కిలోమీటర్లు నడిచివెళ్లిన



మాది బోయినపల్లి మండలం రత్నంపేట. మా ఊరు విలాసాగర్ పంచాయతీ పరిధిలో ఉండేది. అప్పట్లో మా ఊరిలో పోలింగ్ కేంద్రం లేదు. నాలుగు కిలోమీటర్లు నడిచివెళ్లి ఓట్లు వేసేవాళ్లం. విలాసాగర్ దొర వచ్చి ఓ కమ్మ చూపించి.. గీ గుర్తుకు ఓటు వేయాలని చెప్పేవారు. ఓట్ల నాడు అందరం నడుచుకుంటూ వెళ్లి ఓట్లు వేసేటోళ్లం. అప్పట్లో ఓట్ల గురించి ఎవ్వలకు సరిగ్గా తెలియదు. గిప్పటి లెక్క లొల్లి లేదు.

– రాజూరి రామస్వామి(78 ఏళ్లు) రత్నంపేట

ఓటు వేయకుంటే సచ్చినట్లే..



ఆ రోజుల్లో ఎన్నికలు ఇప్పటి లెక్క లేవు. ఇంటికి ఎవరూ రాకపోదురు. జీపుల ద్వారా ప్రచారం చేసేటోళ్లు. నచ్చినోళ్లకు ఓట్లు వేసేది. ఓటు వేయకుంటే సచ్చినట్లే అనుకునేటోళ్లం. ఎక్కడ ఉన్నా ఊరికొచ్చేటోళ్లం. ఇప్పటి లెక్క ఓట్లకు పైసలు ఇచ్చుడు.. మందు పోసుడు అప్పట్లో లేదు. అందరం కూసుని మాట్లాడుకుని ప్రశాంతంగా ఓట్లు వేసేది. ఇప్పుడంతా ఆగమాగం ఉంది.

– మేర నాంపల్లి(65 ఏళ్లు), గంభీరావుపేట

చాలా తేడా వచ్చింది



మా చిన్నతనంలో ఓట్లు వచ్చినయి అంటే ప్రశాంతంగానే ఉండేది. ఇప్పటి లెక్క రోడ్డు మీద దుంకుడు ఎగురుడు లేకుండే. గింత మంది పోటీచేసే వాళ్లు కాదు. ఇద్దరు, ముగ్గురు పోటీలో ఉండేవారు. ఎవరి ప్రచారం వారు చేసుకునే వాళ్లు. అందరం కూర్చుని మాట్లాడుకుని ఓట్లు వేసేది. మద్యం, డబ్బులు పంచుడు లేదు. స్వచ్ఛందంగానే ఓట్లు వేసేది. అప్పటికీ ఇప్పటికీ రాజకీయాల్లో చాలా తేడా వచ్చింది.

– రాపెల్లి సత్తయ్య(70 ఏళ్లు), అశోక్‌నగర్

ఎటు వేసినమో చెప్పేటోళ్లం కాదు

ఓట్లు వచ్చినయి అంటే జీపులకు పెద్ద.. పెద్ద మైకులు కట్టుకుని పాటలు పాడుకుంటూ వచ్చేటోళ్లు. ఏదో దిక్కు ఓటు వేసేవాళ్లం. ఓటు ఎటూ వేసినమో చెప్పేటోళ్లం కాదు. ఓ 20 ఏళ్లు అన్నలు ఓట్లు వేయద్దు అంటే భయం.. భయంగా వెళ్లి వేసేవాళ్లం. అప్పట్లో మా ఊరిలో పోలీస్‌క్యాంపు ఉండేది. గిప్పటి లెక్క లొల్లులు లేవు. ఓట్లు వేసినమా.. ఎవరో ఒక్కరు గెలిచేది. గెలిచినోళ్లు సంబురపడేది. ఓడినోళ్లు బాధపడేది.

– నాగారపు ఎల్లవ్వ(95 ఏళ్లు), వీర్నపల్లి

ఒక్క మాట చెప్తే ఓటు వేసేది



మా కాలంలో ఒక్క మాట చెప్తే ఓటు వేసేది. ఎన్నికల్లో పోటీ చేసే మనిషి కూడా మా ఊరికి వచ్చేవాడు కాదు. వచ్చినా ఎవరినో కలిసిపోయేది. ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఓటుమాత్రం తప్పనిసరిగా ఎటో దిక్కు వేసేవాళ్లం. ఇప్పుడు రాజకీయం అంతా వ్యాపారంగా మారింది. ఓట్లు వేసేందుకు పైసలు, మందు పంచుతున్నారు. ఓటును అమ్ముకుంటే పాపం అనే భావన ఉండేది. ఇప్పుడు అంతా తారుమారైంది.

– చిరువేరి కొండయ్య(75 ఏళ్లు), రుద్రంగి

క్లుప్తంగా

విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి

ముస్తాబాద్(సిరిసిల్ల): సిరిసిల్లలో ఈనెల 3న తలపెట్టిన ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ 'విశ్వరూప మహాసభ'ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కాణపూరం లక్ష్మణ్ కోరారు. మండలం తుర్కపల్లిలో బుధవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

అక్రమ మద్యం పట్టివేత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన బత్తుల సాయి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా బుధవారం ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. మద్యంతోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు. బత్తుల సాయి సిరిసిల్ల నుంచి మద్యం తెచ్చి ఇంటింటికెళ్లి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మద్యం డోర్ డెలివరీకి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని, రూ.5వేల విలువచేసే మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది కిశోర్‌కుమార్, మల్లేశ్, అమృతరెడ్డి, రాజు, కృష్ణకాంత్, రాజేందర్ పాల్గొన్నారు.

దొంగతనం కేసులో జైలు

సిరిసిల్లక్రైం: ద్విచక్రవాహనాలను దొంగతనం చేసిన కేసులో ఒకరికి 2 నెలల 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలు. గత సెప్టెంబర్ 13న అంబికానగర్ సిరిసిల్లకు చెందిన చిలుక రమేశ్ తన ఇంటి ముంగిట బైక్‌ను పార్క్ చేశాడు. అలాగే భూర్ల ప్రతాప్ వెంకంపేటలో, కోడం చందర్ గాంధీనగర్ శ్రీలక్ష్మి డిజిటల్ కలర్ ల్యాబ్ ముందు పార్క్ చేశారు. వారి పనులు ముగించుకుని వచ్చి చూస్తే వాహనాలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో ముస్తాబాద్‌కు చెందిన మీస విష్ణు దొంగలించినట్లు నిర్ధారించి అరెస్ట్ చేశారు. న్యాయమూర్తి ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తల పూజలు



సిరిసిల్లటౌన్: అధికార బీఆర్‌ఎస్ పార్టీ నేతలు ప్రచారాన్ని హోరెత్తించారు. జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి, శ్రీశివభక్త మార్కండేయస్వామి, పోచమ్మ ఆలయాల్లో బుధవారం మంత్రి కేటీఆర్ గెలుపు కోసం ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో గడపగడపకు వెళ్లి ప్రచారం చేపట్టారు. దుకాణాలు, రద్దీ ప్రాంతాల్లో తిరుగుతూ కేటీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, ఆర్‌బీఎస్ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య పాల్గొన్నారు.

బీసీ సీఎం బీజేపీతోనే సాధ్యం



సిరిసిల్లటౌన్: బీసీ ముఖ్యమంత్రి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ సిరిసిల్ల అభ్యర్థి రాణిరుద్రమ అన్నారు. సిరిసిల్లలో బుధవారం నిర్వహించిన బూత్‌స్థాయి సమావేశంలో మాట్లాడారు. బీజేపీలోనే బీసీలకు సముచితస్థానం దక్కుతుందన్నారు. మంత్రి కేటీఆర్‌కు ఇప్పటికే ఓటమి భయం పట్టుకుందన్నారు. బీఆర్ఎస్ నేతలపై ఆపార్టీ అధిష్ఠానానికి నమ్మకం లేకనే ప్రతిపక్ష నేతలను కలుపుకుంటూ పోతున్నారన్నారు. నవంబర్ 4 నుంచి ప్రతి గడపకు వెళ్లి ప్రచారం చేపడతామన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీని వాస్, గర్రెపెల్లి ప్రభాకర్, గూడూరి భాస్కర్, రాజాసింగ్, సిరశ్వాల్ కైలాశ్, గజభీంకార్ చందు తదితరులు పాల్గొన్నారు.

హేమాహేమీల పురిటి గడ్డ కోరుట్ల..!

- బుగ్గారం.. మెట్‌పల్లి కలయిక
- పసుపు..చెరుకు రైతుల ఉద్యమ వేదిక
- బీడీ కార్మికులు.. గల్ఫ్ వలసలు
- పునర్విభజన నుంచీ బీఆర్ఎస్‌దే హవా



కోరుట్ల: గలగలపారే గోదావరి.. నలుమూలలా ఎస్సారెస్పీ పరీవాహక ప్రాంతం.. ఎటు చూసినా పచ్చని పొలాలు. చెమట చిందిస్తూ కనిపించే రైతన్నలు.. మరోవైపు కన్నీటితో నిండిన గల్ఫ్ వలసలు.. అలుపుసొలుపు లేని బీడీ కార్మికుల క్షేత్రం కోరుట్ల. పునర్విభజనకు ముందు మెట్‌పల్లి, బుగ్గారంలో అంతర్భాగమైన ఈ సెగ్మెంట్ నుంచి హేమాహేమీలను అందించింది.


విద్యాసాగర్‌రావు


రత్నాకర్‌రావు


విద్యాసాగర్‌రావు


అర్వింద్


నర్సింగరావు


సంజయ్

ఓటర్ల వివరాలు

మొత్తం ఓటర్లు	2,27,521
మహిళలు	1,18,436
పురుషులు	1,09,083
ఇతరులు	ఇద్దరు

బుగ్గారం.. మెట్‌పల్లి నుంచి వీడి..

1957లో ఏర్పాటైన బుగ్గారం, మెట్‌పల్లి నియోజకవర్గాల కలయిక నుంచి 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కోరుట్లగా ఆవిర్భవించింది. బుగ్గారంలోని కోరుట్ల, మల్లాపూర్ మండలాల నుంచి ఏడు గ్రామాలు, మెట్‌పల్లిలోని మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలాలతోపాటు మల్లాపూర్‌లోని మిగిలిన గ్రామాలను కలిపి నియోజకవర్గంగా ఏర్పడింది. జిల్లాలోనే రెండు మున్సిపాల్టీలు..రెండు రెవెన్యూ డివిజన్లు ఉన్న ఏకైక సెగ్మెంట్ కోరుట్ల కావడం గమనార్హం.

గల్ఫ్ వలసలు..బీడీ కార్మికులు

చక్కని నీటి పారకం.. భూగర్భజలాలు ఉన్నా.. పాతికేళ్లుగా ఈ ప్రాంత ప్రజలు చాలామంది ముంబయి, గల్ఫ్‌దేశాలకు వలస వెళ్తూనే ఉన్నారు. కొన్ని గ్రామాల్లో ఇంటికొకరు చొప్పున గల్ఫ్‌బాట పట్టిన వారు ఉన్నారు. ఇప్పటికీ సుమారు 25వేల మంది గల్ఫ్‌లో ఉన్నారు. పొద్దస్తమానం అలుపు లేకుండా బీడీలు చుట్టే మహిళలు ప్రతి గడపలోనూ కనిపిస్తుంటారు. జీవనభృతి పొందుతున్న వారు ఈ నియోజకవర్గంలో 33వేల వరకు ఉన్నారు.

రైతు ఉద్యమ వేదిక

నియోజకవర్గంలోని మల్లాపూర్ మండలం ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ మూసివేత, ఇక్కడ ఎక్కువగా సాగయ్యే పసుపు పంట మద్దతు ధర అంశాలు మూడుసార్లు జరిగిన ఎన్నికల్లో కీలక అంశాలుగా మారాయి. ఈ రెండు సమస్యల పరిష్కారానికి ఈ ప్రాంతంలో రైతులు లెక్కలేని ఉద్యమాలు చేపట్టారు. ఒక్కో సందర్భంలో షుగర్ ఫ్యాక్టరీ తెరిపించడానికి, పసుపు మద్దతు ధర కల్పించడానికి రైతులు చేసిన ఉద్యమాలతో కోరుట్ల సెగ్మెంట్ రణక్షేత్రంగా మారింది.

నాలుగు సార్లు ఏకపక్షం..

2009లో ఆవిర్భవించిన కోరుట్లకు 2009, 2010, 2014, 2018 ఎన్నికలు జరిగాయి. ఇందులో వరుసగా నాలుగు సార్లు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఎమ్మెల్యేగా గెలుపొంది తన ఓటింగ్ శాతాన్ని 32 నుంచి 51 శాతానికి పెంచుకున్నారు. ఈయన హయాంలోనే కోరుట్ల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్లుగా అవతరించాయి. సుమారు 15 ఏళ్లుగా ఎమ్మెల్యేగా కొనసాగిన విద్యాసాగర్‌రావు ఈసారి వయోభారంతో పోటీ నుంచి తప్పుకొని తన కుమారుడు కల్వకుంట్ల సంజయ్‌ని రంగంలోకి దించారు.

హేమాహేమీలకు పుట్టినిల్లు..

పునర్విభజనకు ముందు ఉన్న మెట్‌పల్లి సెగ్మెంట్ మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావుకు రాజకీయ పురిటి గడ్డగా నిలిచింది. 1985లో మొదటిసారి మెట్‌పల్లి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన తర్వాత హ్యాట్రిక్ సాధించారు. ఆయన కరీంనగర్ ఎంపీగా, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా, మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నత పదవులు అలంకరించారు. 1998 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి కొమిరెడ్డి రాములు భార్య కొమిరెడ్డి జ్యోతి ఎమ్మెల్యేగా గెలిచి ఏడాదిన్నరపాటు పనిచేశారు. జనతా పార్టీ నుంచి 2004లో కొమిరెడ్డి రాములు గెలుపొందారు. ఇక బుగ్గారం నియోజకవర్గం 1957 నుంచి 1978 వరకు ఓసీలకు పట్టం కట్టింది. బీసీవర్గానికి చెందిన అంబల్ల రాజారాంకు 1978లో, కడకుంట్ల గంగారాంకు 1983లో, అలాగే 1985, 1994 అసెంబ్లీ ఎన్నికల్లో శికారి విశ్వనాథంకు పట్టంగట్టింది. 2004లో గెలిచిన జువ్వాడి రత్నాకర్‌రావు దేవాదాయ, స్టాంప్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా వ్యవహరించారు.

కోరుట్ల పోటీ రసవత్తరంల

ఈసారి కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తనయుడు సంజయ్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. సిట్టింగ్‌లకు సంబంధించి వారసులకు దక్కిన ఒకే ఒక సీటుగా కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్ గుర్తింపు దక్కించుకున్నారు. ఒకసారి ఇండిపెండెంట్‌గా.. మరోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన జువ్వాడి నర్సింగరావు ఈసారి కాంగ్రెస్ నుంచి బరిలో దిగుతున్నారు. బీజేపీ నుంచి అనూహ్యంగా నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ఇక్కడి నుంచి బరిలో ఉంటున్నారు. బీఎస్పీ నుంచి యువకుడు నిశాంత్ కార్తీకేయ పోటీ చేస్తున్నారు. కోరుట్ల సెగ్మెంట్‌లో పద్మశాలీ ఓటర్లు, ముస్లిం మైనార్టీలు, ఎస్సీ ఓటర్లు ప్రభావితవర్గాలుగా చెప్పవచ్చు.

హత్యచేసి.. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి..

- ప్రియుడితో భర్తను చంపించిన భార్య
- పోలీసుల విచారణలో వెలుగులోకి..
- నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ శ్రీనివాస్‌రావు


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ, సీఐ, ఎస్సైలు

రామగుండం: తన భర్తను అడ్డు తొలగిస్తే.. సింగరేణి ఉద్యోగం చేసుకుంటూ ఇద్దరం హాయిగా ఉండొచ్చని చెప్పి ప్రియుడితో భర్తను హత్య చేయించింది ఓ మహిళ. అంతేకాదు.. తన భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్లు చిత్రీకరించింది కూడా.. రంగంలోకి దిగిన పోలీసులు.. కూపీ లాగడంతో అసలు విషయం వెలుగుచూసింది. పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీసుస్టేషన్ పరిధిలోని మల్యాలపల్లి సబ్‌స్టేషన్ వద్ద రాజీవ్‌రహదారిపై జరిగిన ఈ ఘటన వివరాలను రామగుండం ఏసీపీ తులా శ్రీనివాస్‌రావు బుధవారం విలేకరులకు వెల్లడించారు.. ఆయన కథనం ప్రకారం.. గోదావరిఖని యైటింక్లయిన్‌కాలనీ సమీప పోతనకాలనీకి చెందిన సింగరేణి ఉద్యోగి లావుడ్య మధుకర్–రమ దంపతులు. వీరికి ముగ్గురు సంతానం ఉన్నారు. రమ తనకు తెలిసిన వారికి పెళ్లి సంబంధం కుదిర్చేక్రమంలో ధరావత్ గోవర్ధన్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇది గోవర్ధన్, రమ మధ్య వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈక్రమంలో గోవర్ధన్ తరచూ రమ ఇంటికి వస్తూ పోతున్నాడు. కొన్నిసార్లు రెండుమూడ్రోజులు ఇక్కడే ఉండేవాడు. దీంతో మధుకర్‌కు తన భార్యపై అనుమానం వచ్చింది. పద్ధతి మార్చుకోవాలని ఆమెను హెచ్చరించాడు. తన వ్యవహారానికి అడ్డువస్తున్నాడనే ఆగ్రహంతో భర్తను అడ్డు తొలగించుకోవాలని ప్రియుడితో కలిసి రమ కుట్ర పన్నింది. మధుకర్‌ను చంపితే సింగరేణి ఉద్యోగం కూడా వస్తుందని, ఇద్దరమూ హాయిగా ఉండొచ్చని చెప్పింది. ఇందుకు అంగీకరించిన గోవర్ధన్.. మరో ఇద్దరు మిత్రుల సాయం తీసుకుని మధుకర్ హత్యకు అక్టోబర్ 29న ప్లాన్ చేశాడు. అదేరోజు మధుకర్ మధ్యాహ్నం విధులు ముగించుకొని ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న గోవర్ధన్ తన స్నేహితులు నాగరాజు, లక్ష్మణ్‌తో కలిసి గోదావరిఖని వచ్చారు. గోవర్ధన్ తన ప్రియురాలు రమకు ఫోన్‌చేశాడు. మధుకర్‌తో మాట్లాడాలని చెప్పాడు. ఈక్రమంలో పల్సర్ బైక్‌పై ఫైవింక్లయిన్ వద్ద గల ఓ వైన్‌షాపులోకి మధుకర్ వచ్చాడు. అక్కడ అందరూ కలుసుకొని మద్యం కొనుగోలు చేశారు. ఆ తర్వాత మల్యాలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని చెట్లపొదల్లోకి వచ్చి మద్యం తాగుతూ ఉన్నారు. గోవర్ధన్ తన వెంట తెచ్చుకున్న ఇనుపరాడు పట్టుకుని, తన ఇద్దరు మిత్రులతో కలిసి మధుకర్‌పై దాడిచేశారు. తీవ్రగాయాలతో మధుకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని రోడ్డు పక్క ఉన్న కాలువలో పడేశారు. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు బైక్‌ను మృతదేహంపై పడేయాలని యత్నించినా.. అదుపుతప్పి పక్కకు పడింది. ఆ తర్వాత హత్య విషయాన్ని గోవర్ధన్ వాట్సాప్‌కాల్ ద్వారా రమకు తెలిపాడు. అక్కడినుంచి ముగ్గురు నిందితులు పారిపోయారు. రమ వ్యవహారశైలిపై మృతుడి తండ్రి నాన్యానాయక్ అనుమానం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు ఆ దిశగా విచారణ చేపట్టడంతో విషయం వెలుగులోకి వచ్చింది. నిందితులు లావుడియా(నునసవత)రమ, ధరావత్ గోవర్ధన్ (నాచారం, మల్హర్ మండలం), కోట లక్ష్మణస్వామి (కొత్తపల్లి, జయశంకర్ జిల్లా), కర్నే నాగరాజు (ఖాసీంపెల్లి, జయశంకర్ జిల్లా)ను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. హత్య జరిగిన 48 గంటల్లోనే రామగుండం సీఐ, ఎస్సైలు కేసును ఛేదించడంతో ఏసీపీ అభినందించారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలి

- క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ బలంగా ఉంది
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్


మాట్లాడుతున్న వినోద్‌కుమార్

గంభీరావుపేట(సిరిసిల్ల)/వేములవాడ: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ఇంటింటికి తీసుకెళ్లి ప్రచారం చేయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. గంభీరావుపేటలో బుధవారం నిర్వహించిన మండల బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ బలంగా ఉందని, మూడోసారి ప్రభుత్వం ఏర్పాటువడం ఖాయమన్నారు. భవిష్యత్‌లో నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టులో పూడికతీసి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతామన్నారు.

దాడులకు పాల్పడడం హేయం

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులపై దాడులకు పాల్పడడం హేయమైన చర్య అని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. దుబ్బాక అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన కత్తిదాడిని ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, చీటి నర్సింగారావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటస్వామిగౌడ్, గంధ్యాడపు రాజు, పట్టణాధ్యక్షుడు వెంకటియాదవ్, ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, ఏఎంసీ చైర్మన్ హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువజన సమ్మేళనం విజయవంతం చేయండి

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించబోయే యువజన సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు కోరారు. సన్నాహక కార్యక్రమంలో భాగంగా బుధవారం చల్మెడ నివాసంలో విద్యార్థి, యువజన విభాగం నాయకులతో చర్చించారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, యూత్ నాయకులు వెంగళ శ్రీకాంత్‌గౌడ్, మంద రాజేందర్, వనపట్ల సందీప్‌రెడ్డి, నరేశ్, అజయ్, పోతు అనిల్, బూర రాజశేఖర్, ముప్పం జీవన్‌గౌడ్, కడతాల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు గంటలే కరెంట్


ఎల్లారెడ్డిపేటలో ప్రచారం చేస్తున్న రవీందర్‌రావు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రంలో మూడు గంటల కరెంట్ వస్తుందని, ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు మాయమవుతాయని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్, ఎల్లారెడ్డిపేటలో బుధవారం స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ బీఆర్ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మంత్రి కేటీఆర్ జిల్లాను అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రభాగాన నిలిపారన్నారు. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను గెలిపించుకోవాలని కోరారు. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు అందె సుభాష్, గుల్లపల్లి నర్సింహారెడ్డి, గీతాంజలి, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటమునిగి వ్యక్తి మృతి


సత్తయ్య మృతదేహం

గంభీరావుపేట(సిరిసిల్ల): మానేరు వాగు తీరంలో తాబేళ్లు, ఎండ్రికాయలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటమునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలం నర్మాలలో బుధవారం విషాదం నింపింది. గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన నూనె సత్తయ్య(34) అనే వ్యక్తి అప్పుడప్పుడు మానేరు వాగు తీరంలో తాబేళ్లు, ఎండ్రికాయల వేటకు వెళ్తుంటాడు. ఈక్రమంలోనే మంగళవారం ఉదయం సత్తయ్య నర్మాల గ్రామ శివారులోని మానేరువాగు తీరానికి వెళ్లాడు. అక్కడ తాబేళ్లు పట్టే క్రమంలో నీటమునిగి మృతిచెందాడు. కుటుంబసభ్యులు, బంధువులు సత్తయ్య కోసం మానేరు తీరాన వెతుకుతుండగా.. మృతదేహం కనిపించింది. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుని భార్య లీరా ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

పింఛన్ పత్రాలను మేమే పారవేశాం

- మీసేవ నిర్వాహకుడు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని ఆవునూర్ డంపింగ్‌యార్డులో లభించిన పింఛన్ దరఖాస్తు ఫారాలను తామే పారవేసినట్లు మీసేవ నిర్వాహకుడు కట్కం లచ్చయ్య ఎంపీడీవోకు బుధవారం నివేదించాడు. దీపావళి పండుగ సందర్భంగా మీసేవ కేంద్రంలో నిల్వ ఉన్న ఆసరా పెన్షన్ దరఖాస్తు ఫారాలను శుభ్రం చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో గ్రామపంచాయతీ అధికారులకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నాడు. మూడేళ్ల క్రితం ఆన్‌లైన్ దరఖాస్తులు తీసుకున్నామని, వీటితో పనిలేనందున డంపింగ్‌యార్డుకు తరలించినట్లు పేర్కొన్నాడు. కార్యదర్శికి ఎలాంటి సమాచారం తాము ఇవ్వలేదన్నాడు.

దొంగతనం కేసులో మహిళకు ఆరు నెలల జైలు

సిరిసిల్లక్రైం/ముస్తాబాద్: పుస్తెల తాడు దొంగతనం చేసిన కేసులో నిందితురాలికి ఆరు నెలల జైలుతోపాటు రూ.100 జరిమానా విధిస్తూ సిరిసిల్ల మున్సిఫ్ కోర్టు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ప్రవీణ్ బుధవారం తీర్పు వెలువరించారు. ముస్తాబాద్ ఎస్సై శేఖర్ తెలిపిన వివరాలు. మండలంలోని పోతుగల్‌కు చెందిన మద్దిపెల్లి నర్సవ్వ(70) గత జులై 3న బ్యాంక్‌లో దాచుకున్న డబ్బుల కోసం ముస్తాబాద్ కొచ్చింది. ఆమెను గమనించిన మహిళా దొంగ.. ఎండ బాగుంది.. నీళ్లు తాగుతమని కల్లు దుకాణం వద్దకు తీసుకెళ్లింది. అక్కడ నర్సవ్వకు కల్లు తాగించి పడుకోబెట్టి.. ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును అపహరించుకుని పోయింది. అప్పటి ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాక్ష్యాలను సేకరించి దొంగతనానికి పాల్పడింది గంభీరావుపేటకు పాటి సునీత(49)గా గుర్తించి అరెస్టు చేశారు. కేసు పూర్వాపరాలు, సాక్షులను విచారించిన ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ప్రవీణ్ చోరీ చేసిన సునీతకు ఆరునెలల జైలు, రూ.100 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ దేవేందర్ ద్వారా నిందితురాలు నేరం అంగీకరించడంతో శిక్ష పడింది. అపరిచిత వ్యక్తులను నమ్మొద్దని, వారు ఇచ్చే పానియాలు తీసుకోరాదని ఎస్సై శేఖర్ సూచించారు.

మద్దతు ఇవ్వండి..

- బొడిగె శోభ


మాట్లాడుతున్న బొడిగె శోభ

బోయినపల్లి(వేములవాడ): మండలంలోని తడగొండ, మల్కాపూర్, అనంతపల్లి, బోయినపల్లితోపాటు పలు గ్రామాల్లో బుధవారం చొప్పదండి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బొడిగె శోభ ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీజేపీకి మద్దతు తెలియజేసి అవకాశం ఇవ్వాలని కోరారు. బీజేపీ మండలాధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నర్సింహాచారి, కొనుకటి హరీశ్, రాజు, వెంకటేశ్‌తోపాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రచారవాహనం ఫ్లెక్సీ చించివేత


గుర్తు తెలియని వ్యక్తులు చింపివేసిన ఫ్లెక్సీ

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం గుర్రంవానిపల్లి శివారులోని సిరిసిల్ల–వేములవాడ ప్రధాన రహదారిలో గుర్తుతెలియని వ్యక్తులు నలుగురు కారులో వచ్చి కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ ప్రచార వాహనంపై ఫ్లెక్సీని చించివేశారు. గమనించి డ్రైవర్ మందలించడంతో వారు వెంటనే కారులో పరారయ్యారు. సంఘటన స్థలానికి వచ్చిన వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, వేములవాడ టౌన్ ఎస్సై ప్రశాంత్‌రెడ్డి వివరాలు సేకరించారు. అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఆది శ్రీనివాస్‌కు వస్తున్న మద్దతును చూసి ఓర్వలేకనే ఇలాంటి చిల్లర చేష్టలకు పాల్పడుతున్నారన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఎడ్యుకేషనల్ హబ్‌గా సిరిసిల్ల



మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

సిరిసిల్లఅర్బన్: బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి కేటీఆర్ చొరవతో సిరిసిల్ల నియోజకవర్గం ఎడ్యుకేషనల్ హబ్‌గా మారిందని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు మానాల అరుణ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. 2014 కంటే ముందు సిరిసిల్ల నియోజకవర్గంలో ఒక డిగ్రీ కాలేజీ ఉండేదని, ప్రస్తుతం మంత్రి కేటీఆర్ చొరవతో జేఎన్టీయూ, మెడికల్, అగ్రికల్చర్, కేజీ టు పీజీ, నర్సింగ్ తదితర కాలేజీలు ఏర్పాటయ్యాయన్నారు. విద్యార్థుల సంక్షేమానికి బీఆర్ఎస్ ఎంతగానో కృషిచేస్తుందన్నారు. తంగళ్లపల్లి బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు చీమల ప్రశాంత్, టౌన్ ఇన్‌చార్జి బాబా, దీపక్, అశ్వక్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం శివారులోని మానేరువాగు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. సింగారం గ్రామానికి చెందిన సంపంగి బాబు అనే డ్రైవర్ ట్రాక్టర్‌లో రాచర్లగొల్లపల్లికి ఇసుకను తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో దాడిచేసి పట్టుకున్నారు. అనుమతిపత్రాలను పరిశీలించగా అనుమతులు లేవని చెప్పడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి బాబుతోపాటు ట్రాక్టర్ యాజమాని సంపంగి రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిర్వాసితుల త్యాగాలు వెలకట్టలేనివి

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడఅర్బన్: ముంపు గ్రామాలతో తనకు విడదీయలేని అనుబంధం ఉందని, నిర్వాసితుల త్యాగాలు వెలకట్టలేనివని.. వారి సమస్యలు పరిష్కరిస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. మండలంలోని ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం గ్రామాల్లో బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. రానున్న రోజుల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే రూ.14 కోట్లు వచ్చి ఉన్నాయని, మరో రూ.28 కోట్లు కేటాయిస్తే ముంపు గ్రామాల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. జెడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, వైస్ ఎంపీపీ రవిచందర్‌రావు, సర్పంచులు ఇటుకల నవీన, జింక సునీత, ఊరడి రాంరెడ్డి, ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణస్వామి, పీఏసీఎస్ చైర్మన్లు ఏనుగు తిరుపతిరెడ్డి, కృష్ణదేవరావు, పార్టీ మండలాధ్యక్షుడు ప్రవీణ్, బూర బాబు, రెడ్డవేణి పర్శరాములు, గుండకార్ల నరేశ్ తదితరులు ఉన్నారు.